క్లుప్తంగా

జీవామృతంతో పంటలకు మేలు



జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ ట్రైనీ మాస్టర్ శారద

రేగిడి: జీవామృతంతో పంటలకు మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ ట్రైనీ మాస్టర్ సీహెచ్ శారద అన్నారు. సోమవారం మండలంలోని చాటాయవలస గ్రామంలో జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల అధిక ఖర్చు కావడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట చేతికి రాదని తెలిపారు. తక్కువ ఖర్చుతో తయారయ్యే జీవామృతాన్ని పంటలకు వినియోగిస్తే అధిక దిగుబడి, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు, సర్పంచ్ కరణం గోవిందరావు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయాలి



సచివాలయ సిబ్బందితో సమావేశమైన మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న భూముల రీసర్వేను వేగవంతం చేయాలని కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్లు, కార్యదర్శులతో ఆయన సమావేశమై భూముల రీసర్వేపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు 30 శాతం మేర మాత్రమే సర్వే పూర్తవడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ నెల 12వ తేదీలోగా శతశాతం సర్వే పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, టీపీఓ జి.నాగలత పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బాడంగి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు కనీస వేతనం అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. ఇదే విషయమై సోమవారం తహసీల్దార్ బాలమురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరిట జరుగుతున్న వేధింపులు ఆపాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు చేయాలని, సూపర్‌వైజర్ పోస్టుల వయోపరిమితి పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ రమణమ్మ, సీత, కృష్ణవేణి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు వచ్చేశాయ్..



వెలుగు కార్యాలయానికి చేరిన కుట్టుమిషన్లు

బొబ్బిలి రూరల్: జిల్లా కేంద్రం నుంచి స్థానిక వెలుగు కార్యాలయానికి 25 కుట్టుమిషన్లు, టేబుళ్లు సోమవారం వచ్చాయి. మరో కుట్టుమిషన్లు త్వరలో వస్తాయని ఏపీఎం పీఏ స్వామి తెలిపారు. సంక్రాంతి తర్వాత బొబ్బిలిలో శిక్షణ కేంద్రంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చే అవకాశం ఉందన్నారు.

ధాన్యం మిల్లుల పరిశీలన



కృష్ణాపురం ధాన్యం మిల్లులో ధాన్యం బస్తాలు పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఎస్‌డీటీ.

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో ఉన్న ధాన్యం మిల్లులను తహసీల్దార్ ఎస్.రాజారావు, సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణ కలిసి సోమవారం పరిశీలించారు. ధాన్యం బస్తాల సేకరణ, నిల్వలు, ధాన్యం అన్‌లోడింగ్‌కు తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షించి, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల్లోని ధాన్యం బస్తాలను తొలుత అన్‌లోడ్ చేసి పంపాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వారికి మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంత వరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. గతంలో టీడీపీ జన్మభూమి కమిటీలు తమకు నచ్చిన వారికే ప్రభుత్వ పథకాలు, రుణాలు ఇచ్చేవన్నారు. ఇప్పుడు అలా కాదని అర్హులైన వారు సచివాలయాన్ని సంప్రదిస్తే చాలు అని, దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజలకు పారదర్శక పాలన అందుతోందన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు కూడా మంజూరు చేస్తోందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఎం. ప్రసన్నలక్ష్మి, ఎంపీటీసీ ఆర్.నర్సింగరావు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిఒక్కరికీ ఆదర్శమని ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. ప్రతిపక్ష నేతగా ఆయన అప్పుడు చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తికావస్తున్న సందర్భంగా సోమవారం స్థానిక పట్టణంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. అనంతరం యాత్ర విశేషాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 14 నెలల పాటు సీఎం జగన్మోహన్‌రెడ్డి అప్పుడు ప్రజల్లో తిరిగారని, వారి కష్టాలను తెలుసుకుని, ఇప్పుడు పరిష్కరిస్తున్నారన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే యాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. నవరత్నాలు పథకాలతో మరెన్నో పథకాలను ప్రతీ పేదవానికి అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నారన్నారు. 3,648 కిలోమీటర్ల మేర యాత్రను కొనసాగించిన ఆయన ఇచ్ఛాపురం వద్ద సరిగ్గా నాలుగేళ్ల క్రితం ముగించారని తెలిపారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ, అనంతరం టీడీపీ ఎన్నో ఇబ్బందులు పెట్టినా, అక్రమ కేసులు బనాయించినా వాటన్నింటినీ అధిగమించి, రాష్ట్ర ప్రజల మనసు గెలుచుకున్న నాయకుడు ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని అన్నారు. ఆయన వ్యక్తిత్వం, శ్రమ, పట్టుదల, రాజకీయ ప్రయాణం ఎంతో ఆదర్శనీయమన్నారు. తన పాలనా మార్క్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే కాకుండా, ఆదర్శవంతమైన పాలన చేస్తున్నందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతీ పంచాయతీలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఏర్పాటు చేసి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. అంతకుముందు పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే జోగులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, కె.సుదర్శనరావు, పి.లక్ష్మణరావు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, నాయకులు జి.అప్పలనాయుడు, జి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల ప్రారంభానికి లబ్ధిదారులు ముందుకు వచ్చేలా చూడాలని, నిర్మాణ దశలోని ఇళ్లు పూరయ్యేలా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను లబ్ధిదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.సులోచనారాణి, హౌసింగ్ ఏఈ కనకరాజు పాల్గొన్నారు.

పెదపోలమ్మ సంబరాలు ప్రారంభం



అమ్మవారి ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు



పెదపోలమ్మకు భక్తుల ప్రత్యేక పూజలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పక్కి గ్రామంలో పెదపోలమ్మ సంబరాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తోలేళ్ల ఉత్సవం నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటాలను ఊరేగించారు. మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు పర్యవేక్షణలో పండగ నిర్వహణ బాగుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

108 సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అంబులెన్స్ సేవలపై అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

వంగర: అత్యవసర వేళల్లో లభించే 108 అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సిబ్బంది బి.విశ్వనాథం, యు.అనీల్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని శ్రీహరిపురం గ్రామంలో 108 అంబులెన్స్ సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, పాముకాటుకు గురైన వారితో పాటు డయేరియా, కోవిడ్‌తో బాధపడే వారు అత్యవసర వైద్యసేవలు పొందేందుకు అంబులెన్స్ సేవల కోసం ఆశ్రయించాలన్నారు.

సీహెచ్‌సీని సందర్శించిన కాయకల్ప వైద్యబృందం



బాడంగి సీహెచ్‌సీని సందర్శిస్తున్న కాయకల్ప వైద్య బృందం

బాడంగి: స్థానిక సీహెచ్‌సీని అనకాపల్లి జిల్లాలోని కె.కోటపాడు సీహెచ్‌సీకి చెందిన కాయకల్ప వైద్య బృందం సోమవారం సందర్శించింది. ఆస్పత్రిలో ఓపీ నిర్వహణ దగ్గర నుంచి పేషెంట్ల వార్డు, ఆపరేషన్ థియేటర్, పారిశుద్ధ్య పరిస్థితులు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలు చాలా శుభ్రంగా ఉండడంపై బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీలక్ష్మి, రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని కూడా కాయకల్ప బృంద సభ్యులు డాక్టర్ సువర్ణ, జి.రాధ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని వార్డుల్లోని పేషెంట్ల బెడ్‌లు, రూమ్‌లలో వసతులు, పేషెంట్లకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు. ఆస్పత్రి సేవలు విస్తృతం చేయాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సునీత, కోటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ శమంతకమణి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పెన్షన్ల పంపిణీ

రాజాం: స్థానిక పట్టణంలోని ఆదర్శనగర్‌లో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు చేతులమీదుగా లబ్ధిదారులకు పెన్షన్లు సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు.

చెత్త సేకరణపై అవగాహన

రాజాం సిటీ: మండలంలోని గురవాం గ్రామ చెత్త సంపద సృష్టి కేంద్రాన్ని ఈఓపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన తడి, పొడి చెత్త సేకరణ, చెత్త వేరుచేసే విధానంపై క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ సేకరించిన ఎరువును చెత్త సంపద కేంద్రాలకు తరలించి, తద్వారా ఎరువు తయారు చేయాలని తెలి పారు. ఇక్కడ తయారయ్యే ఎరువును సబ్సిడీపై రైతులకు అందజేసి, తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు.

చెరువు పనుల పరిశీలన

మెంటాడ: మండలంలోని లోతుగెడ్డ, ఆంద్ర గ్రామాల్లో నిర్మాణ దశలోని సచివాలయ, ఆర్‌బీకే భవనాలతో పాటు చెరువు పనులను ఎంపీడీఓ తివిక్రమ్ సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. ఏవైనా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని గైరమ్మపేటలో చెరువు పనులను పరిశీలించిన ఆయన స్థానికులు తమ పొలాలకు రోడ్డు నిర్మాణం చేయాలన్న విజ్ఞప్తి మేరకు ఉపాధి హామీ నిధులతో రోడ్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ప్రజా సంకల్పయాత్రకు నాలుగేళ్లు..

మెంటాడ: ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు సోమవారంతో నాలుగేళ్లు పూర్తయినట్లు ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రజల కష్టాలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి ఆనాడు ప్రజా సంకల్పయాత్రకు శ్రీకారం చుట్టారన్నారు. ఆనాడు యాత్రలో తెలుసుకున్న ఎంతోమంది కష్టాలను ఈరోజు ఆయన ముఖ్యమంత్రి హోదాలో పరిష్కరిస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నేతగా ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

16 నుంచి బయోమెట్రిక్ హాజరు

తెర్లాం: మండలంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులంతా ఈ నెల 16వ తేదీ నుంచి తప్పనిసరిగా ఫేసియల్ బయోమెట్రిక్ హాజరు వేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రతీ ఉద్యోగి ఏపీఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో మాత్రమే ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నమోదు చేయాలన్నారు. బయోమెట్రిక్ హాజరు ఆధారంగానే జీతభత్యాలు చెల్లించడం జరుగుతుందన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

బొబ్బిలి: విద్యార్థులు, యువత గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు. స్థానిక వాసు జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు వాడడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి, బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సెబ్ ఎస్ఐ చిన్నంనాయుడు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి

వంగర: గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో మహిళా స్వయం శక్తి సంఘాలు బలోపేతం కావాలని ఏపీఎం మీసాల చక్రపాణి ఆకాంక్షించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెలుగు శాఖ ద్వారా మహిళా సంఘాలకు మంజూరు చేస్తున్న రుణాల రికవరీ పెంచాలని కోరారు.

మాస్కులు తప్పనిసరి ధరించాలి

తెర్లాం: కోవిడ్ ఫోర్త్‌వేవ్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కోవిడ్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారంతా మాస్కులు ధరించాలని, అలాగే కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది కూడా మాస్కులు ధరించి ఆదర్శంగా నిలవాలన్నారు.

నేడు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూ

బాడంగి: బొబ్బిలి ఆర్‌డీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ కె.రాజ్యలక్ష్మి ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. బాడంగి ఐసీడీఎస్ పరిధిలోని తెర్లాం, బాడంగి మండలాల్లో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు సంబంధించి, దరఖాస్తులు చేసుకున్న వారికి హాల్‌టికెట్లు కూడా పంపామన్నారు. సంబంధిత ధ్రువపత్రాలతో అభ్యర్థులంతా కార్యాలయానికి హాజరు కావాలన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయం

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



బొబ్బిలి: పార్టీ పట్టణ అధ్యక్షుడు గోపాలరావుకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రేగిడి: కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

బొబ్బిలి: వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయమని, అలాగే తాను కూడా ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు జోస్యం చెప్పారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు సోమవారంతో నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావుకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీని ఓడించలేరన్నారు. రానున్న ఎన్నికల్లో గెలవాలన్న ఆశతో టీడీపీ ఎన్నో కుట్రలు చేస్తోందని, ఇరుకు రోడ్లలో చంద్రబాబు సభలు పెట్టి ప్రజలను మభ్యపెట్టడంతో పాటు అమాయకులైన ఎంతో మంది ప్రాణాలు తీస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు ఎప్పుడో వందకు వంద మార్కులు వేశారని తెలిపారు. పవన్, చంద్రబాబు భేటీ ద్వారా వారిద్దరి మ్యాచ్ ఫిక్సింగ్ మరోసారి తేటతెల్లమైందన్నారు. ప్రజా సంక్షేమం కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎంను చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ కృష్ణారావు, బుడా చైర్మన్ ఐ.పార్వతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ టి.పార్వతి, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు సోమవారంతో నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని వావిలవలస గ్రామంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పార్టీ శ్రేణులతో కలిసి కేకు కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. అనంతరం యాత్ర ముఖ్య విశేషాలు, సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సీఎం జగనన్న చేపట్టిన ఈ యాత్రకు విశేష స్పందన లభించిందని, యాత్రలో ప్రజలు ఆయనకు విన్నవించిన ప్రతీ సమస్యను గుర్తు పెట్టుకుని మరీ ఆయన పరిష్కరిస్తుండడం, ఆ దిశగా పరిపాలనలో సంస్కరణలు తీసుకువస్తుండడం చాలా గొప్ప విషయమని ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహన్‌రావు, జిల్లా వ్యవసాయసలహా మండలి చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు ఎం.ప్రసన్నలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి



బూసాయవలస పాఠశాల ఆవరణలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఈఈ జగ్గారావు

రామభద్రపురం: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి అని ఎస్ఎస్ఏ డీఈఈ జగ్గారావు సూచించారు. నాడు–నేడు పనుల్లో భాగంగా మండలంలోని బూసాయవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించిన ఆయన పాఠశాలల ఆధునీకరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పనులకు నిధుల మంజూరుతో పాటు ఇసుక, సిమ్మెంట్, ఇనుము సరఫరా చేస్తోందన్నారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.అప్పారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులంతా కృషి చేయాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె తొలుత వివిధ శాఖల వారీగా అభివృద్ధి పనులు, సమస్యలపై ఎంపీడీఓ శంబంగి రామకృష్ణతో కలిసి సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యుత్ శాఖపై జరిగిన సమీక్షలో గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సభ్యులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆరోపించారు. అరసబలగలో ఇటీవల విద్యుత్ వైర్లు తగిలి వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదానికి గురైందని, ప్రమాదాలు జరిగితే తప్ప సమస్యలు పరిష్కరించరా అని ఎంపీపీ ఉమాలక్ష్మి అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ ఏఈ సమావేశానికి హాజరుకాకపోవడంతో సభ్యులు తెలియజేసిన సమస్యలన్నింటినీ ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఎంపీపీ జేఎల్ఎం సూరికి తెలిపారు. రెవిన్యూ శాఖపై సమీక్షలో తహసీల్దార్ రాజేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతోందని, రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా చూడాలని సభ్యులను కోరారు. భూముల రీసర్వేకు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, విద్యుత్, ఇతర సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ సూచించారు. వచ్చే మండల సమావేశం నాటికి సభ్యులు తెలియజేసిన సమస్యలన్నింటినీ పరిష్కరించేలా అధికారులు చూడాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు సీహెచ్ సత్యనారాయణ, రమాదేవి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తి



ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న బొబ్బిలి హౌసింగ్ డీఈఈ అప్పయ్య

బాడంగి: ఉగాది పండగ నాటికి బొబ్బిలి నియోజకవర్గంలో నిర్దేశించిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తి చేయాలని బొబ్బిలి సబ్‌డివిజన్ హౌసింగ్ ఈఈ పి.అప్పయ్య సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ అక్కారావుతో కలిసి సమావేశమైన ఆయన బొబ్బిలి, తెర్లాం, బాడంగి మండలాల్లో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 2,244 ఇళ్ల నిర్మాణాలు వస్తున్న ఉగాదికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, బాడంగి మండలంలో కనీసం 500 ఇళ్ల నిర్మాణం పూర్తి స్థాయిలో జరగాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈఓ వై.దుర్గారావు సూచించారు. సోమవారం మండలంలోని మద్దివలస ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ ఒక్క విద్యార్థి విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చదువులో వెనకబడిన విద్యార్థులకు మరింత బాగా చదువు నేర్పించడంపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.మోహనరావు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి బోర్ల మరమ్మతులు



రుషింగిలో బోర్లు బాగుచేస్తున్న మెకానిక్‌లు

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో తాగునీటి బోర్ల మరమ్మతులు సోమవారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రధాన వీధి, రామాలయం వీధి, ఎస్సీ వీధిలో పనిచేయకుండా మూలకు చేరిన బోర్లును బాగుచేసి, పునరుద్ధరించారు.